జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



ఆదివారం | 26-1-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 229 పేజీలు: 4 వెల : రూ.7




# తప్పెవరిది?

* షాపింగ్‌మాల్స్‌లో భద్రత డొల్ల
* అగ్గిపెట్టేల్లా భవన నిర్మాణాలు
* పనిచేయని అగ్నిమాపక యంత్రాలు
* నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు
* కాసులకు కక్కుర్తిపడి చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
* మాల్స్‌లో ప్రమాదాలు జరిగితే ఎవరిది బాధ్యత

**శ్రీకాకుళం క్రైం, జనవరి 25 (వార్త):** శ్రీకాకుళం నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. అందుకుతగ్గట్టుగానే బహుళ అంతస్థులతో కూడిన షాపింగ్ మాల్స్ పెరుగుతున్నాయి. నగరంలోని జీటీ రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఎస్‌ఆర్, ఆర్‌కే, సీఎంఆర్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్స్‌తో పాటు బంగారం, ఎలక్ట్రికల్, భవన నిర్మాణ సామగ్రి విక్రయించే షాపులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు బహుళ అంతస్థుల్లోనే నడుస్తున్నాయి. నాలుగైదు బహుళ అంతస్థులు గల ఈ షాపింగ్‌మాల్స్, తదితర భవనాల్లో కనీస భద్రతా ప్రమాణాలు లేవు. ప్రమాదం జరిగితే అగ్నిమాపక వాహనాలు వెళ్లేందుకు సరిపడా స్థలం కూడా లేదు. గ్రౌండ్ ఫ్లోర్‌లోకి కేవలం కార్లు, ద్విచక్రవాహనాలకు పార్కిగ్ మాత్రమే ఇస్తున్నారు. ప్రమాదాల సమయంలో లోపలకు ప్రవేశించేందుకు, బయటకు వచ్చేందుకు అత్యవసర మార్గాలు లేవు. ఈ భవనాల్లో పై అంతస్థులకు వెళ్లేందుకు, వచ్చేందుకు ఒక్కటే మార్గం . లిఫ్ట్ సదుపాయం ఉన్నా అందులో ఎనిమిది మందికి మించి పట్టేలా లేదు. సరిపడా నీటిని కూడా అందుబాటులో ఉంచడం లేదు. ఫైర్ సేఫ్టీ యంత్రాలు ఉన్నా పనిచేస్తున్నాయో లేదో తెలియదు. మాల్స్ బయటకు అందంగా తీర్చిదిద్దుతున్నారు తప్ప లోపలంతా డొల్లే. అగ్నిమాపక, పోలీసు, నగరపాలక సంస్థ అధికారులు ఎవరికివారు.. యమునా తీరు అన్న చందంగా వ్యవహరించడం, సమన్వయలోపం.. మాల్స్ యజమానులు భవన నిర్మాణాల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. శనివారం శ్రీకాకుళం నగరంలోని సౌత్‌ఇండియా షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదం జరగడానికి ఇదే కారణమని నగరవాసులు భావిస్తున్నారు. షాపింగ్‌మాల్‌లో వెంటిలేషన్ పూర్తిగా లేకపోవడంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు నానా ఇబ్బందులు పడాల్సివచ్చిందని, చివరకు ఎక్స్‌కవేటర్లు, క్రేన్ల సాయంతో గోడలు బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించి మంటలను అదుపుచేశామని అగ్నిమాపక శాఖాధికారి నిరంజన్ రెడ్డి చెప్పారంటే భద్రతా ప్రమాణాలు ఏ మేరకు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో భవనంలో ఉన్న అలారం మోగాలి, ఆటోమేటిక్‌గా నీటిని వెదజల్లే యంత్రాలు పనిచేయలి.. కాని అటువంటిదేమీ ఈ షాపింగ్‌మాల్స్‌లో జరగలేదు. ఈ ఒక్క భవనమే కాదు.. జిల్లాలోని బహుళ అంతస్థుల భవనాల్లోని అన్నింటా ఇదే పరిస్థితి ఉంది. పండగ సమయంలో ఈ షాపింగ్ మాల్స్ రద్దీగా ఉంటాయి. అటువంటి సమయంలో ఇటువంటి అగ్ని ప్రమాదాలు జరిగివుంటే పెద్ద సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలిసిపోయేవన్న విమ్మలు ఉన్నాయి. 100 మంది సిబ్బంది.. పది గంటలు పాటు శ్రమించినా ఈ మంటలు అదుపులోకి రాలేదంటే ప్రమాదం ఏ





# మాల్‌లో.. మంటలు



## * షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం * మంటలు ఆర్పేందుకు పది గంటలు శ్రమించిన ఫైర్ సిబ్బంది, అధికారులు * రూ.కోట్లలో ఆస్తి నష్టం * కన్నీటిపర్యంతమైన సిబ్బంది

శ్రీకాకుళం నగరంలోని సూర్యమహాల్ జంక్షన్ వద్ద ఉన్న సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో శనివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ మాల్ నుంచి ఉదయం ఎనిమిది గంటలకు పొగలు రావడాన్ని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది యాజమాన్యానికి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి షట్టర్లు తెరిచేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. 12 అగ్నిమాపక శకటాలు, 80 మంది సిబ్బంది ఈ మంటలను ఆర్పేందుకు నానాకష్టాలు పడ్డారు. దట్టమైన పొగలు పైఅంతస్థులకు వ్యాప్తి చెందుతుండడంతో అందరిలోనూ గందరగోళం నెలకొంది. మంటలు ఆర్పడం కష్టంగా మారడంతో చివరకు నాలుగు ఎక్సకవేటర్లతో షాపింగ్‌మాల్ ముందు ఉన్న షట్టర్లను తొలగించారు. అలాగే గోడలకు రంధ్రాలు పెట్టారు. అప్పటికే దట్టమైన పొగలు రెండో అంతస్తులోకి వ్యాప్తి చెందింది. భారీ క్రేన్లను తీసుకు వచ్చి రెండో అంతస్థులోకి వెళ్లి మంటలను ఆర్పారు. అగ్నిమాపక సిబ్బంది ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ శ్రమించి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.కోట్లలో ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మంటలు ఆర్పే సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న విలువైన దుస్తులను షాపింగ్‌మాల్ సిబ్బంది అంతా కలిసి బయటకు తెచ్చే ప్రయత్నం చేశారు. తమ కళ్లముందే షాపింగ్ మాల్ కాలిపోతుండడాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఉదయం నుంచి మాల్ వద్ద ఉండి మంటలు అదుపుచేసేందుకు ఫైర్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# కుల దూషణపై కేసు నమోదు



**కొత్తూరు, జనవరి 25(వార్త):** మదనాపురం గ్రామ పంచాయతీలో అట్రాసిటీ కేసును శుక్రవారం నాడు నమోదు చేశామని కొత్తూరు ఎస్సై ఎండి అమీర్ అలీ తెలిపారు. మదనాపురం గ్రామానికి చెందిన లిమ్మక దేవిక అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అగతముడి మాధవరావు, జంక కృష్ణమూర్తి అనే ఇద్దరు వ్యక్తులపై ఈ కేసు నమోదు చేశామన్నారు. ఆ గ్రామంలోని భూమి తగాదాలో అగతముడి మాధవరావు, జంక కృష్ణమూర్తి కలిపి దేవిక అనే మహిళను ఇంటికి పిలిపించి తనను కులం పేరుతో దూషించినట్లు ఆమె పోలీస్ వారికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

# సాంకేతికతతో సైబర్ నేరాలు ఛేదించాలి




**శ్రీకాకుళం, జనవరి 25(వార్త):** ప్రస్తుత కాలంలో ఎక్కువ సంఖ్యలో జరుగుతున్న సైబర్ మోసాలు అరికట్టేందుకు, సైబర్ కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని కావున ప్రతి ఒక్కరు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సైబర్ కేసులు త్వరితగతిన చేధించాలని ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జిల్లాలో ఉన్న పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ కేసులు నమోదు, దర్యాప్తు, ఆర్థిక సైబర్ నేరాల్లో పొగుకుట్టుకున్న నగదు ఫ్రిజ్ తదితర అంశాలపై అదనపు ఎస్పీ కెవి రమణ తో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా పోలీసు అధికారులకు సైబర్ నేరాల దర్యాప్తుకు చేపట్టాల్సిన మెళుకవులు, తీసుకోవాల్సిన చర్యలు, కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే పద్ధతి పై జిల్లా ఎస్పీ సూచనలు దిశ నిర్దేశాలు చేశారు .సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వేధింపులు, ఓ.టి.పి. ఫ్రాడ్స్, ఆర్థిక మోసాలు, మొబైల్ లోను యాప్స్, లింక్స్ వంటి నేరాల్లో దర్యాప్తు ఏవిధంగా చేయాలి, సాక్ష్యాలను ఏవిధంగా సేకరించాలి, నిందితులను ఏవిధంగా గుర్తించాలన్న విషయాలపై పోలీసు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ – ఎన్సిఆర్పి పోర్టల్ లో నమోదు కాబడిన ఫిర్యాదు రిజిస్టర్ నందు వివరాలు తో బాధితుని మాట్లాడి కేసుల దర్యాప్తు తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులు ను ఆదేశించారు. సైబర్ పోలీసు పోర్టల్ లో నమోదు కాబడిన ఫిర్యాదు వివరాలు పరిశీలించి కేసులు త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు చేతిలో బాధిత వ్యక్తులు పోగొట్టుకున్న నగదును గోల్డెన్ అవర్‌లో ఫ్రీజ్ చేయించి కేసులు దర్యాప్తు అనంతరం చట్ట ప్రకారం కోర్టు ద్వారా ఫ్రీజింగ్ చేసిన నగదును బాధితులకు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్ కేసులు ఛేదించడంలో ప్రతి అంశాన్ని కూడా కీలకంగా తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం లభిస్తున్న టూల్స్, బేసిక్ నాలెడ్జ్ తోపాటు హ్యూమన్ ఇంటెలిజెన్స్ తో కేసులు చాకచక్యంగా సులభంగా ఛేదించాలని ఎస్పీ సూచించారు. ప్రస్తుతం నేరాల తీరు మారుతున్నదని, ప్రతీ నేరం కూడా సైబరు క్రైం, సాంకేతికతతో ముడిపడి ఉంటున్నదన్నారు. అవగాహన, అప్రమత్తతోనే సైబర్ నేరాలు నియంత్రించగలమని కావున ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామ స్థాయిలో గ్రామాల్లో సందర్శించి గ్రామ ప్రజలను సైబర్ నేరగాలు చేసే మోసాలు, సైబర్ నేరాలు గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి సైబర్ నేరగాళ్ల వల్ల ప్రజలు మోసపోతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేసే విధంగా వారిని అవగాహన కల్పించాలని సూచించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ ముందు డిఎస్పీలు,సిఐలు, ఎస్సైలు వారి యొక్క కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ నుంచి పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ ప్రథమచికిత్స శిక్షణ అవసరం

**-డీఎంహెచ్‌వో వెంకట బాల మురళీకృష్ణ**




**శ్రీకాకుళం, జనవరి 25(వార్త):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో సీనియర్ ప్రొఫెషనల్ ఫస్టే ఎయిడ్ ట్రైనింగ్ 8 రోజుల పాటు నిర్వహించబడింది. జిల్లా నలుమూలల నుండి 26 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ ప్రథమచికిత్స శిక్షకులు, డాక్టర్ శ్రీకాంత్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ ప్రథమ చికిత్సలో శిక్షణ ఇవ్వడం జరిగినది. శిక్షణలో భాగంగా హై బీపీ, లో బిపి, గుండెపోటు, సిపిఆర్ ప్రక్రియపై అవగాహన, విపత్తుల సమయాల్లో గాయాలు కట్లు కట్టుట, పాముకాటు, తేలుకాటు, “గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్స, కరెంట్ షాకు తగిలిన వారికి చికిత్స, రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి ప్రథమచికిత్స ఇటువంటి మరిన్ని అంశాలపై శిక్షణ ఇవ్వబడింది. ఈ సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స పై అవగాహన ఉండాలని, ఆపద సమయంలో తోటి వారిని రక్షించాలని, సరైన సమయంలో అంబులెన్స్‌కి కాల్ చేయాలని, దగ్గర్లో ఉన్న హాస్పిటల్‌కి పంపించాలని డీఎంహెచ్‌వో వెంకట బాల మురళీకృష్ణ శిక్షణ అభ్యర్థులకు వివరించారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా చేసే సేవలను గురించి చెప్తూ ఆపద సమయంలో ప్రథమచికిత్స చేసి రక్షించిన వారికి సరైన గుర్తింపు ఉంటుందని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ పార్టిసిపేట్షన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం.కళ్యాణ్‌చక్రవర్తి, చిన్మయ్‌రావు, పి.చైతన్య కుమార్, ఇతర రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హైస్కూల్లో భవనానికి వీజీకే మూర్తి పేరు

**-సంస్మరణ సభలో ఎమ్మెల్యే గొండు శంకర్**



**శ్రీకాకుళం, జనవరి 25(వార్త):** అంబేద్కర్ ఆడిటోరియంలో కామ్రేడ్ వీజీకే మూర్తి సంస్మరణ సభలో స్థానిక శాసనసభ్యులు గొండు శంకరరావు మాట్లాడుతూ ఎన్టీర్ మున్సిపల్ హైస్కూల్ లో నూతనంగా నిర్మించిన భవనానికి విజికేమూర్తి పేరు పెడతామని ప్రకటించారు. పూర్వ శాసన మండలి సభ్యులు యం.వి.ఎస్.శర్మ,సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు,స్థానిక మాజీ శాసనసభ్యులు గుండ.లక్ష్మీదేవి, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ యావజ్జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన మహా నాయకుడని కొనియాడారు. గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సాంస్కృతిక రంగంలో విశేషమైన కృషి చేశారని కొనియాడారు. అంబేద్కర్ యూనివర్సిటీ ఏర్పాటుకు పాదయాత్ర నిర్వహించారని అన్నారు. విజికే మూర్తి గారు జీవిత విశేషాలు ఉద్యమాలకు సంబంధించి ప్రజాశక్తి ప్రత్యేకసంచికను ఆవిష్కరించారు. ప్రారంభానికి ముందు వీజికే మూర్తి గారి చిత్రపటాని పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, సౌత్ సెంట్రల్ జోన్ ఇన్స్యూరెన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు పి.సతీష్, ప్రముఖ కథారచయిత అట్టాడ అప్పలనాయుడు, డా.సుధీర్, ఎ.పి ఎన్.జి.ఓ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి చౌదరి. పురుషోత్తంనాయుడు, సిపిఐ యం.ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.ప్రకాష్, ఎన్.టి.ఆర్. యం.హెచ్ స్కూల్ పూర్వ విద్యార్థులు సంఘం జామి. భీమశంకర్, సీఐటీయూ సీనియర్ నాయకులు కేతవరపు. శ్రీనివాస్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు, మూర్తి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు




పలాస, జనవరి 25, (వార్త) : అంగన్వాడి కార్యకర్తలుగా నియమాతులైన వారంతా విధి నిర్వహణలో ఆసత్వం దరిచేరకుండా బాధ్యతగా పనిచేయాలని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. శనివారం పలాస టిడిపి కార్యాలయంలో అంగన్వాడి కార్యకర్తలకు నియామక పత్రాలు అందజేశారు. ఇటీవల అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు సంబంధించి పలాస మండలానికి సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను అనుసరించి నిర్వహించిన ఇంటర్వ్యూలో ముగ్గురు ఎంపికయ్యారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ పీరికట్ల విఠల్ రావు, రాష్ట్ర అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్షణ్ కుమార్ అందజేశారు. పీఎం జన్ మన్ లో భాగంగా తర్లాకోట పంచాయితీలో నూతనంగా మంజూరైన కొటారింగి తాళ్లభద్ర, సిరిపురం గ్రామాలకు అంగన్వాడీ కార్యకర్తలుగా ఎంపికైన సవర జానకి, సవర రజినీ, లోత్తూరు పంచాయతీ పెద్దపల్లియకి చెందిన సవర ప్రమిల నియామక పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్, బడ్డ నాగరాజు, లోడగల కామేష్, హెూరియా మోహన్ రావు, మురిపింటి కుమార్ రాజా, సవర సోమేశ్, అవుగన దశరథ తదితరులు పాల్గొన్నారు.



## పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

**శ్రీకాకుళం, జనవరి 25(వార్త):** 2024-2025 గాను ఎంపిక చేయబడ్డ పారా లీగల్ వాలంటీర్స్ కు ట్రైనింగ్ ప్రోగ్రాం ను ఏర్పాటు చేశారు. ఈ ట్రైనింగ్ లో భాగంగా వీరికి న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను గూర్చి పారా లీగల్ వాలంటీర్స్ యొక్క విధులు తెలిపారు. పారా-లీగల్ వాలంటీర్ ప్రజలకు, ముఖ్యంగా సమాజంలోని బలహీన వర్గాలకు చెందిన వారికి, మానవ గౌరవంతో జీవించే హక్కు గురించి తెలుసుకునేలా, రాజ్యాంగ బద్ధం, చట్టబద్ధంగా హామీ ఇవ్వబడిన అన్ని హక్కులతో పాటు విధులు, బాధ్యతలను నిర్వర్తించేలా వారికి అవగాహన కల్పించాలని గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్యదర్శి జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆర్. సన్యాసినాయుడు, న్యాయవాది ఎ భువనేశ్వర్, న్యాయవాది జి ఇందిరా ప్రసాద్, జిల్లాలో గల పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై అవగాహన




**శ్రీకాకుళం, జనవరి 25(వార్త):** రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా పైడిభీమవరం మండలంలో గల ఆర్డార్ పాఠశాల నందు డ్రైవర్లకు, హెల్పర్లకు, టీచర్లకు, విద్యార్థులు, సిబ్బందికి శనివారం రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రహదారి భద్రత నియమాలు, సురక్షిత ప్రయాణానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంవీఐ పి.వి.గంగాధర్‌రావు, ఏఎంవీఐ పి.అమృతకుమారి వివరించారు. టీచర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం హక్కులు కాపాడుకోవాలి



**హిరమండలం, జనవరి 25(వార్త):** శ్రీకాకుళంలోని వీ వన్ కన్వెన్షన్ హాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో 75వ సంవిధాన్ గౌరవ్ అభియాన్ రాజ్యాంగ సమిధాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం హక్కులు విలువలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరి పైన ఉందన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, అట్టాడి రవిబాబ్జీ, చల్లా వెంకటేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ ఎస్ఐని కలిసిన శేఖర్




ఇచ్ఛాపురం, జనవరి 25(వార్త): ఇచ్ఛాపురం టౌన్ ఎస్ఐ ఎం.ముకుంద రావును 23వ వార్డు బెల్లుపడ కాలనీకి చెందిన తెలుగుదేశం నాయకులు శాసన శేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా విధుల్లో చేరడంతో ఆయనను కలిసి అభినందించారు.

## బీజేపీ మండల అధ్యక్షునిగా సురేష్



**మందస, జనవరి 25(వార్త):** భారతీయ జనతాపార్టీ మందస మండల అధ్యక్షునిగా తెలుకల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సురేష్ పేరును పూర్వపు అధ్యక్షుడు పొందర దుదిష్టిపాత్రో ప్రతిపాదించగా.. ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. సురేష్ ఇటీవల పార్టీ సభ్యత్వం, క్రియాశీలక కార్యక్రమాల్లో చురుకుగా పని చేయడంతో పాటు అంకితభావం, కృషి, పట్టుదలతో బీజేపీ బలోపేతానికి తనదైన శైలిలో పని చేస్తున్నారు. ఆయన కృషిని గుర్తించిన పార్టీ మండల అధ్యక్ష పదవి అందించింది. ఈ సందర్భంగా పార్టీ జోనల్ ఇన్చార్జి రౌతు చిరంజీవరావు, ఇప్పిలి వెంకటరావు, రట్టి లక్ష్మణరావు, ప్రధాన మన్మథరావు సురేష్ కు అభినందనలు తెలిపారు. సమర్థునికే పార్టీ పగ్గాలు అందజేశారని హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# రీ సర్వే సమస్యల నివృత్తికి హెల్ప్‌లైన్ నంబరు 8143679222

**వంగర, జనవరి 25(వార్త):** భూముల రీసర్వే సందేహాల నివృత్తికి హెల్ప్ లైన్ నెంబరును ప్రభుత్వం కేటాయించింది. ఏపీలో భూముల రీ సర్వేలో వచ్చే సందేహాలను నివృత్తి చేయడానికి హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు సర్వే, సెటిల్మెంట్, భూ రికార్డుల శాఖ సంచాలకులు ప్రభాకర్రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భూ యజమానులతో పాటు రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది సైతం కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు ఫోన్ 81436 79222 నంబర్ లో సంప్రదించొచ్చని సూచించారు. అధికారులు నిర్ధారించిన కొలతలపై అప్పీలు చేసుకునేందుకు ప్రభుత్వం అందరికీ అవకాశం కల్పిస్తుందని స్పష్టం చేశారు.



## పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంజీఆర్

**కొత్తూరు, జనవరి 25(వార్త):** సిరుసువాడ గ్రామ పంచాయతీలో శనివారం పాతపట్నం శాసనసభ్యుడు మామిడి గోవిందరావు ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసివరప్రసాద్, మాతల గాంధీ, అగతముడి అరుణ్‌బాబు, డి.డి.ఏ.హెచ్ శ్రీకా కుళం వైద్యులు పి.రామ్ మోహన్ రావు, ఈవో డి ఎల్ డి ఏ సిహెచ్ సత్యప్రకాష్, ఏడి డియల్ డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ సిహెచ్ సుబ్రహ్మణ్యం ఏడి సరుబుజ్జిలి, డాక్టర్ జి నారాయణరావు ఏడి కొత్తూరు, డాక్టర్ బి శ్రీనివాసరావు ఏడి సీతంపేట, డాక్టర్ పి అనిల్ వి ఏ ఎస్ కొరసవాడ, డాక్టర్ టి హరికృష్ణ, ఇతర పశుసంవర్ధక శాఖ అధికారులు, గ్రామ పాడి రైతులు, కూటమి నాయుకులు, అధికారులు తదితరులు పాల్గున్నారు.

## అంగన్‌వాడీలకు నియామక పత్రాలు అందజేత



**మందస, జనవరి 25(వార్త):** మందస మండలంలోని ఏడు అంగన్ వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ల పోస్టులకు ఇటీవల ఇంటర్వ్యూలు జరిగాయి. బలరాంపురం, బురసాయి, గోపిటూరు, చాపరాయి, దాలసరి, సవరమధ్య, సవరరాజపురం కేంద్రాలకు సంబంధించి ఎంపిక కాబడిన అంగన్ వాడీ సహాయకులకు నియామకపు పత్రాలను ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేశారు. ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న ఈ పోస్టులకు నియామకాలు జరిగాయని సీడీపీఓ కె.వసుంధరాదేవి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, డుంకురు తిరుపతి, తమిరి భాస్కరరావు, రాజాన మహేశ్, లబ్బ రుద్రయ్య, గార కృష్ణారావు, మంగళపాత్రో, సవర శంకర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మంగమ్మ, రామలక్ష్మి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాలపై ప్రత్యేక నిఘా



**మందస, జనవరి 25(వార్త):** దొంగతనాలపై ప్రత్యేక నిఘా వేసినట్టు మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. వజ్రపుకొత్తూరు మండలం పూండిలో జరిగిన బంగారు దుకాణాల్లో చోరీపై ఆయన స్పందించారు. ఈ మేరకు బంగారు వ్యాపారులకు ప్రత్యేకంగా నోటీసులు అందజేశారు. దుకాణాల్లో సీసీ కెమేరాలు తప్పక ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమేరాలు పని చేయకపోతే బాగు చేయాలన్నారు. వాచ్మేన్లను కూడా నియమించుకోవాలని వారికి తెలిపారు. బంగారు వ్యాపారులు పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పోలీసుశాఖ కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, దొంగతనాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే తాము కార్యాచరణ ప్రణాళిక తయారు చేశామని, నిరంతరం అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. ప్రజలు సహకరిస్తే శాంతిభద్రతలను కాపాడడం సాధ్యపడుతుందన్నారు.

## మోడల్ పాఠశాలను తనిఖీ చేసిన జెడ్పీ సీఈవో

**మెళియాపుట్టి, జనవరి 25 (వార్త):** ప్రభుత్వ ఆదేశాలు మేరకు మెళియాపుట్టి, మోడల్ పాఠశాలను జిల్లా పరిషత్ సీఈవో ఎల్ వీ ఎన్ శ్రీధర్ రాజు తనిఖీ చేశారు. మండలంలో గల కొసమాల, వసుంధరలలో ఉన్న ప్రాథమిక పాఠశాలను స్థానిక ఎంపిడిఓ నరసింహ ప్రసాద్ పండా ఆధ్వర్యంలో శనివారం నాడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలను సందర్శించి రికార్డులను, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలను నాటారు. ఈ సందర్శనలో ఆయనతోపాటుగా ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, ఈఓపీఆర్డీ తారకేశ్వరి, మండల విద్యాశాఖాధికారి దేవేందర్ రావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులున్నారు.

# రాష్ట్రస్థాయిలో పలాస విద్యార్థికి మూడో స్థానం

**-సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో**

**9వ తరగతి విద్యార్థి ప్రతిభ**



**పలాస, జనవరి 25 (వార్త):** సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రస్థాయిలో పలాస విద్యార్థికి మూడో స్థానం లభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథరావు తెలిపారు. పుదుచేరిలో ఈ నెల 20 నుంచి 25 వరకు జరిగిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2025లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు జినగ షణ్ముఖరావు మార్గదర్శకత్వంలో 9 వ తరగతి విద్యార్థి జస్వంత్‌పాత్రో తయారు చేసిన రిజనరేటివ్ బ్రేకింగ్ సిస్టం అనే ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి విభాగంలో మూడవ స్థానాన్ని సాధించిందించారు. వీరికీ పుదుచేరి స్పీకర్, విద్యాశాఖ మంత్రులు చేతుల మీదుగా ట్రోఫీ, సర్టిఫికెట్, వెయ్యి రూపాయల నగదు బహుమతిని అందజేశారు. గెలుపొందిన విద్యార్థి, గైడ్ ఉపాధ్యాయునికి పాఠశాల యాజమాన్య కమిటీ, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేసారు.

# సచివాలయ ప్రాంగణంలోనే పందుల విహారం

**- ఆందోళనలో విద్యార్థులు, గ్రామస్తులు**

**- పరిసరాలు అపరిశుభ్రమవుతున్నాయని ఆవేదన**

**- పంచాయతీ వారు పట్టించుకోవాలని వేడుకోలు**



సంతబొమ్మాళి, జనవరి 25(వార్త): మండలంలో నౌపడ గ్రామంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందులు పిల్లలతో కలిసి రోడ్లపై, వీధిలలో, జన నివాసాల చుట్టూ సంచరిస్తూ ప్రజలకు, స్కూల్ పిల్లలకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పందులు సంచారంతో పలు వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో నౌపడలో లేని పందులు ఆకస్మికంగా గుంపులుగా పందులు ఎలా వచ్చాయని గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పందుల పెంపక దారులు జననివాసాల్లోకి వదిలేస్తూ ప్రజారోగ్యానికి కీడు చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పందుల పెంపకం దారుల పై తగు చర్యలు తీసుకొని పందుల నివారణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# ప్రతీ సంఘం వీఓ జెండర్ పొదుపు చేయాలి



**మందస, జనవరి 25(వార్త):** మందస మండలంలో పంచ సూత్రాలు పాటిస్తున్న ఏ గ్రేడ్ సంఘాలన్నీ తమ గ్రామ సంఘం లో వీఓ జెండర్ పొదుపు తప్పనిసరిగా చేయాలని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శనివారం మండల పరిధిలోగల అంబుగాం-బొడ్లూరు గ్రామ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పొదుపు ఖాతాలలో నిధులను సక్రమముగా ఉపయోగించు కోవడంతోపాటు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కోసం యూనిట్లు స్థాపించుకోవడానికి ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్ పేరుతో బ్యాంకులు తక్కువ వడ్డీకే వ్యక్తిగతంగా మహిళలకు యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు తయారు చేస్తున్న వస్తువులను ఆన్లైన్ డిజిటల్ కామర్స్ లో నమోదు చేసుకుని మార్కెటింగ్ చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వి.వో.ఏ. మహాలక్ష్మి తో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్స్ మంగమ్మ, ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.

# బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ఎల్ఎన్ పేట, జనవరి 25(వార్త):** మండలంలోని దబ్బపాడు గ్రామం నుంచి అగ్రహారం వరకు సుమారు రూ.70లక్షల వ్యయం గల జాతీయ గ్రామీణ ఉపాది పథకం ద్వారా మంజూరైన బిటి రోడ్డును పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే ప్రతీ గ్రామం అభివృద్ధి చెందుతుందని కూటమి ప్రభుత్వం ఏర్పడి నుంచి ప్రతీ గ్రామంలో సిసి రోడ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జమ్మి పద్మావతి, మోహనరావు, సర్పంచ్ లు, కూటమి నాయకులు వెలమల గోవిందరావు, కొవిలాపు క్రిష్ణమాచారి,నడిపిల్లి నారాయణరావు,అంపిలి పోలినాయుడు, పిర్ల సీతారాం, శివ్వాల తేజేశ్వరరావు, పొన్నాన రామకృష్ణారావు, యారబాటి రాంబాబు, అంబటి జోగారావు, మూకళ్ళ అప్పలస్వామి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## హౌస్ హెూల్డ్ మ్యాపింగులో తప్పనిసరిగా నమోదుచేసుకోవాలి

**-మున్సిపల్ కమీషనర్ రామారావు**

పలాస, జనవరి, 25 ( వార్త): పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ప్రతి ఒక్క సిటిజన్, హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ లో రిజిస్టర్ కావాలని కమీషనర్ నడిపేన రామారావు కోరారు. వార్డు సచివాలయాలలో సంప్రదించి, హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ లో రిజిస్టర్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలలో 90% పైగా నమోదు చేసుకోవడం జరిగిందని తెలిపారు. మిగిలిన వారు కూడా తప్పనిసరిగా ఈ హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





**శ్రీకాకుళం, జనవరి 25(వార్త):** శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) నందు శనివారం రాజ నీతి శాస్త్ర విభాగాధిపతి పి.శంకరనారాయణ 'జాతీయ ఓటర్ల దినోత్సవం' నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే. సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ప్రతి సంవత్సరం ఈ రోజున ఓటు హక్కు పైన, ప్రజాస్వామ్య వ్యవస్థ పైన ,ప్రజలకు విద్యార్థినులకు, అవగాహన కలిగించడం కోసం, ఎన్నికల్లో ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు, టర్ల ప్రాముఖ్యత తెలియజేసేందుకు దేశ భవిష్యత్తుపై యువత ఆధారపడి ఉన్న నేపథ్యంలో వారికి ఓటు హక్కు ప్రాధాన్యత తప్పనిసరిగా తెలియజేయటం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుంటామన్నారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి పి.శంకరనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటరు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవడం జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రధాన ఉద్దేశం అని అన్నారు.

ఈ సంవత్సరం థీమ్ "ఓటింగ్ లాగా ఏమీ లేదు నేను కచ్చితంగా ఓటు వేస్తాను 'అనేది గత సంవత్సరపు థీమ్ కొనసాగింపుగా ఓటు హక్కు యొక్క ప్రాధాన్యతను నొక్కి వక్కాణిస్తుందన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అందరూ "ఓటర్ల ప్రతిజ్ఞ"ను చేశా రు.కార్యక్రమంలో కళాశాల అకడమీక్ కోఆర్డినేటర్ సి.హెచ్. కృష్ణారావు, ఐ.క్యు.ఎ.సి. కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కళా శాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టరు ఎ.మోహన్‌రాజు, రాజనీతి శాస్త్ర అధ్యపకురాలు పి.రాజేశ్వరి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎచ్చెర్ల, జనవరి 25(వార్త):** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆద్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ గారు మాట్లాడుతూ 2011 సం.లో మన్మోహన్ సింగ్ గారు ఈ ఓటర్ల దినోత్సవం ప్రారంభించారని, 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులంతా ఓటరు గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎచ్చెర్ల తహశీల్దారు శ్రీ. గోపాలరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండేలా ఎన్నికల కమిషన్ ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందని ప్రజలు, వయోజనలు వినియోగించుకోవలన్నారు. ఏవో ముని రామకృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 ప్రకారం ప్రతి పౌరుడుకి ఓటు హక్కు కల్పించింది అని అన్నారు.డీన్ మోహన్ కృష్ణ చౌదరి మాట్లాడుతూ ఓటర్ల నమోదు చేసుకోవడం తో పాటు ఓటు ను సక్రమంగా వినియోగించుకోవటం కూడా ముఖ్యమని తెలియజేసారు.ఈ సందర్భంగా ఈ రోజు సుమారు 400 మంది విద్యార్థులు డాక్టర్ ఎం.పి సూరి గణేష్ గారి ఆధ్వర్యంలో ఆన్లైన్లో తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల తహసీల్దార్ ఆఫీస్ ఆర్.ఐ జి.శ్రీనివాసరావు,ఫైనాన్స్ ఆఫీసర్ వి.వాసు,వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ డా పెద్దింటి ముకుందరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.వి.సింహాచలం, డా.బి.శ్రీధర్, శ్రీ. తంగి అసిరినాయుడు, డా.శ్రీనివాసరావు మరియు అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.




# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



**పలాస, జనవరి 25 (వార్త):** ఓటు హక్కు కలిగి ఉండడం వజ్రాయుధంతో సమానమని, ఓటు హక్కు అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ డైరెక్టర్ వజ్జ బాబురావు అన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో జాతీయ ఓటరు దినోత్సవము శనివారం నిర్వహించారు. ఈ సందర్బంగా ఓటు ఆవశ్యకత ను వివరించారు. 2011 వ సంవత్సరము నుంచి ఓటరు దినోత్సవము జరుపుతున్నారని, ప్రతి ఓటరు ఓటు యొక్క అవశ్యకతను గుర్తించా లన్నారు. అనంతరము హైస్కూల్ లో ఓటు అవశ్యకతపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేత లకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అర్డీఓ గ్రాంది వెంకటేష్, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, చైర్మన్ బల్ల గిరిబాబు, టిడిపి నాయకులు పీరికట్ల విఠల్, లోడగాల కామేశ్వరరావు, హెచ్ఎం చిన్నంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం, జనవరి 25(వార్త):** జాతీయ ఓటర్ల దినోత్సవం ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎలక్టరోల్ రిజిస్ట్రేషన్ అధికారి బేవార పద్మావతి, తహసీల్దార్ యన్. వెంకటరావు, సబ్ ట్రెజరీ ఆఫీసర్ యు. ప్రసాద్, ఎం ఈ ఓ అప్పారావ్ ల ఆధ్వర్యంలో జరిగింది. వేడుకలలో భాగంగా కొత్త ఓటర్లకు ఏపిక్ కార్డులు అందజేశారు. సీనియర్ సిటిజెన్ ఓటర్లకు సన్మానం చేసారు. ఇటీవల కాలేజీలలో నిర్వహించిన "ప్రజాస్వామ్యం లో ఓటు విలువ" మీద వ్యాసరచన, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్ లు, ఉత్తమ బి ఎల్ ఓ లకు అవార్డు లు అందజేశారు. అనంతరం బిఎల్ఓలు, విద్యార్థులతో ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేసారు. బాలికల జూనియర్ కళాశాలలో నేషనల్ ఓటర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పిఓ ఎస్ రజనీకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి శంకరరావు మాట్లాడుతూ ఓటు హక్కు సద్వినియోగం పరుచుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.కర్ణాకర్‌రావు. పి.ప్రసాద్‌రావు, కే.జగదీశ్వర్‌రావు, వై.జనార్దన్‌రావు, పి.సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.






**నరసన్నపేట, జనవరి 25(వార్త):** సామాన్యుడి చేతిలో ఓటే వజ్రాయుధమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ అన్నారు. వయోజనులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందేలా విద్యార్థులంతా తమ గ్రామాల్లో అవగాహన కల్పించాలనీ కళాశాల విద్యార్థులకు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. దేశ రాజకీయాలను మార్చే ఓటు హక్కు నమోదు విషయంలో గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో ఈ ఏడాది ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురవరపు సత్యనారాయణ, వదనగిరి, అప్పన్న, డాక్టర్ మల్లేష్, సోమశేఖర్, శాంతారావు, ఆనంద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




**ఎల్ఎన్ పేట, జనవరి 25(వార్త):** లక్ష్మీ నర్సు పేట గ్రామంలో 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవం ను రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగ సంఘ నాయకులు, ఉత్తమ ఉపాధ్యాయులు ఎంకే మిశ్రో, కేజీబీవీ ఎస్ ఓ ఎం వి అంబికా ఆధ్వర్యంలో కేజీబీవీ నందు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వో రమణమ్మ, సచివాలయం సిబ్బంది డిజిటల్ అసిస్టెంట్ భాస్కర్ రావు,సెక్రెటరీ భాగ్యలక్ష్మి,ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీ నారాయణ,ఉపాధ్యాయులు ఉపేంద్ర, సునీత, సాయి బాల,స్వర్ణలత,లక్ష్మీ,మాలతి,ధన లక్ష్మి,నిర్మల,అరుణ, లీలావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**వంగర, జనవరి 25(వార్త):** ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైనది ఓటుగా తహశీల్దార్ డి.ధర్మ రాజు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్స సందర్భంగా శనివారం నాడు స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నాయకులు విద్యార్థులు రెవెన్యూ సిబ్బందితో కలిసి ఘనంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ప్రజలకు. బ్రహ్మాయుధమన్నారు. తప్పని సరిగా ఓటు నమోదు ఓటుహక్కు నువినియోగించుకోవడం తప్పని సరిగా వివరించారు. జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మజ్జి గణపతిరావు మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరూ ఓటు విలువ తెలుసుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఓటు ప్రాధాన్యతను అయన వివరించారు. కార్యక్రమంలో ముందుగా తహసీల్దార్ కార్యాలయం నుండి బస్ స్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో తహసీల్దార్ తో సహా సిబ్బంది విద్యార్థులు తప్పకుండా ఓటు వేద్దాం,ప్రజాస్వామ్యాన్ని నిలబెడదాం, ఓటు విలువ నిలబెట్టు, అవినీతికి మట్టు పెట్టు , ఓటు హక్కు అందరి బాధ్యత అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వంగర బస్ స్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి రెడ్డి గంగాభవాని, డి టీ రమణారావు, ఆర్ ఐ రామారావు, రెవెన్యూ సిబ్బంది విద్యార్థులు తదితరులు అధికారులు ఉన్నారు.






**పలాస, జనవరి 25(వార్త):** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పలాసలో అర్థశాస్త్రము రాజనీతి శాస్త్రము విభాగాల ఆధ్వ ర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరిగాయి. ఓటు యొక్క ప్రాము ఖ్యత పైన క్విజ్, వక్తృత్వ, రంగవల్లి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను అంద జేశారు. వక్తృత్వ పోటీలలో ప్రథమ ద్వితీయ తృతీయ విజేతలుగా ఎం పూజిత సెకండ్ బిఎ, ఎస్ చందు ఫస్ట్ బీకాం, జి సుమలత ఫస్ట్ బీకాం, లను ప్రకటిం చారు. క్విజ్ పోటీలలో ఐ చామంతి టీం ప్రథమ స్థానం ను జి సుమలత టీం ద్వితీయ స్థానాన్ని పొందారు. రంగవల్లి పోటీలలో ప్రథమ ద్వితీయ స్థానాలను ఎన్ సౌమ్య సెకండ్ ఎంపీసీఎస్, కె మమత ఫస్ట్ జెడ్ సి ఏ లు పొందగా తృతీయ స్థానాన్ని ఎం నీలిమ ఫస్ట్ బీకాం పొందడం జరిగినది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన యువతి యువకులు అందరూ ఓటరు జాబితాలలో ఓటర్లుగా నమోదు చేసుకోవాలని భవిష్యత్తు ఎన్నికలలో ఓటు హక్కుని సద్వినియోగపరచుకొని సమర్థవంతమైన ప్రభుత్వ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక







# సేవకు ప్రతిరూపం..

# ఎంజీఆర్





**ఎంజీఆర్.. ఎంజీఆర్.. ఎంజీఆర్.. ఆయన ఎక్కడకు వెళ్లినా.. ఇదే నామస్మరణం.. ఎంజీఆర్ అంటే మామిడి గోవిందరావు. ఉద్యోగం చేస్తూ సంపాదించిన దానిలో కొంతభాగం సొంత గ్రామ అభివృద్ధికి సాయం చేసిన సామాజికవేత్త. పేదలకు ఆర్థికంగా ఆదుకుంటున్న సేవాతత్పరుడు. ట్రస్టును ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు చదువు చెప్పిస్తున్న విద్యావేత్త. ఆలయాల నిర్మాణానికి సాయం అందిస్తున్న ఆధ్యాత్మికవేత్త. పదవి ఉంటే మరిన్ని సేవలు చేయొచ్చన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యే అయిన రాజకీయ వేత్త. ఎంజీఆర్ అనే మామిడి గోవిందరావుపై 'జాతీయ వార్త'లో ప్రత్యేక కథనం.**

**పాతపట్నం, జనవరి 25 (వార్త):** పాతపట్నం నియోజకవర్గం పేరులో పాతదనం ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలు రాజకీయ చైతన్యంలో ముందుంటారు. కొత్త ఒరవడి కలిగి అభిమానించే వారికి అందలమెక్కించే స్వచ్ఛమైన మనసులు కలిగిన నియోజకవర్గం పాతపట్నం. ఇంతటి చరిత్ర కలిగిన నియోజకవర్గం పేరు వినగానే అందరికీ గుర్తు వచ్చేది కరువు, మంచినీటి సమస్యలు, పేదరికంతో అల్లాడుతున్న ప్రజలు. గత కొన్నేళ్లుగా అనేక మంది రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించినప్పటికీ అభివృద్ధిలోనూ చిట్ట చివరి స్థానమే. వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారే ఎక్కువ. ఇక్కడ ఉపాధి లేక బతుకుజీవుడా అంటూ పట్టణ ప్రాంతాలకు ఉపాధి బాట పడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తన ఊరిని విడిచి బతుకుతెరువు కోసం వలస పోయి తాను సంపాదిం చిన దానిలో కొంత తన ఊరిని బాగు చేసుకోవాలని తాపత్రయపడిన వ్యక్తి మామిడి గోవిందరావు. అతనిని అభిమానులు ముద్దుగా పిలుచుకునే పేరు ఎంజీఆర్. తమ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోయిన ఎంజీఆర్ తన తండ్రి గారైన కీర్తిశేషులు మామిడి అప్పారావు పేరిట చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. తన సొంత నిధులు కోట్లాది రూపాయలతో నియోజకవర్గ ప్రజలకు విద్య, వైద్యం, తాగునీరు, దేవాలయాల నిర్మాణాలు, పునర్నిర్మాణాలే కాకుండా పేదలకు ఆర్థికంగా సాయం చేస్తూ వారి కళ్లల్లో వెలుగులు నింపారు.

## అంచెలంచెలుగా ఎదుగుతూ..

పాతపట్నం మండలం తామర గ్రామంలో జన్మించిన మామిడి గోవిందరావు (ఎంజీఆర్) ఉన్నత విద్యను అభ్యసించి వ్యాపారంలో అంచలంచెలుగా ఎదిగారు. తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం

... మిగతా 6లో











జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం






# సేవకు ప్రతిరూపం.. ఎంజీఆర్

(ఐదో పేజీ తరువాయి)

చేసుకున్న ఎంజీఆర్ పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చారు. తాను సంపాదించిన కొంత మొత్తంలో తాను పుట్టి పెరిగిన ప్రాంత ప్రజలకు సాయం చేసేందుకు నిర్ణయించుకున్నారు. ముందుగా తన సొంత గ్రామాలైన తామర, తీమర గ్రామాలను దత్తత తీసుకొని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దారు. దీంతో గ్రామస్థులు కృతజ్ఞతా భావంతో ఎంజీఆర్ కుటుంబానికి రెండుసార్లు తామర గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, పాతపట్నం వైస్ ఎంపీపీగా బ్రహ్మరథం పట్టారు. 2024లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాతపట్నం నియోజకవర్గంలో పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి వరకూ సామాజిక వేత్త, వ్యాపారవేత్త, సేవాతత్పరుడిగా ఉన్న ఎంజీ ఆర్ ఎమ్మెల్యే అయ్యారు. నియోజక వర్గంలో అస్త వ్యస్తంగా ఉన్న రాజకీయ పరిణామాలను తనకు అనుకూలంగా మలుచుకుని పద్మ వ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిలా కాకుండా కురుక్షేత్రాన్ని ఛేదించిన అర్జునుడిలా పాతపట్నం నియోజకవర్గం చరిత్రలోనే ఎవరూ సాధించలేనిది, సాధ్యం కాని మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలు పొందిన పోరాట యోధుడుగా ఎంజీఆర్ నిలిచారు.



## రోడ్లకు మహర్దశ..

స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినప్పటికీ పాతపట్నం నియోజకవర్గంలో సరైన రహదారులు లేక నేటికీ గిరిజనులకు డోలిమోత తప్పట్లేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఎంజీఆర్ పాతపట్నం నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రహదారి, అలాగే మండలానికి కనక్టివిటీ కోసం డబల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టారు. రవాణా శాఖ మంత్రి, గిరిజన శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి, గుమ్మడి సంధ్యారాణిని పలుమార్లు కలిసి నిధులు మంజూరుకు వినతిపత్రాలను అందజేశారు. 40 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న మెళియాపుట్టి మండలం కరజాడ వయా టక్కోయి గాథలవలస మీదుగా పలాస మండలం కేసుపురం రహదారికి రెండు కోట్ల రూపాయలతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. హిరమండలం మండలం అక్కరాపల్లి టు అంతకాపల్లి రహదారికి కోటి రూపాయలతో నిర్మాణం చేశారు. సుమారు 50 కోట్లతో కమలమ్మకోట్టు జంక్షన్ టు నివగాం డబల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. అచ్యుతాపురం టు సరాలి రహదారి, ఆలాంధ్ర రోడ్డు టు మెలియాపుట్టి డబల్ రోడ్డు, అమ్మవారి గుడి టు పి.ఎల్ పురం టెక్కలి తెంబరు రహదారి, పాసి గంగు పేట టు ఆర్.ఎల్.పురం రహదారి, కొత్తూరు టు సిరుసువాడ రహదారి నిర్మాణం చేసి ప్రజల మన్ననలను అందుకున్నారు. ఉపాధి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐటీడీఏ తదితర శాఖల నుంచి సుమారు 80 కోట్ల రూపాయలను గ్రామాల అభివృద్ధికి కేటాయించారు. గత 15 ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి చూడని ప్రజలు ఈ ఆరు నెలల్లో ఎంజీఆర్ చేస్తున్న కృషిని అభినందిస్తున్నారు.

## మెళియాపుట్టి కేంద్రంగా ఇండస్ట్రియల్ క్యారిడర్..


స్థానికంగా ఉపాధి లేక యువత వలసలు పోతున్నారని గ్రహించిన ఎంజీఆర్ ముందు చూపుతో ఏపీఐఐసీ ద్వారా మెళియాపుట్టి కేంద్రంగా ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు నడుంబిగించారు. చిన్న,మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, మహిళలకు టెక్స్ టైల్స్ పరిశ్రమలు ఏర్పాటుతో పాటు కుట్టు మిషన్ల పంపిణీ చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో జిల్లాల పున: విభజన కారణంగా సీతంపేట ఐటిడిఏను కోల్పోవడం జరిగింది. దీంతో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే గ్రహించి మెళియపుట్టి మండల కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటుకు దీక్ష బూనారు. ఐటీడీఏ ఏర్పాటు వల్ల గిరిపుత్రుల జీవన ప్రమాణాలు, గ్రామాల అభివృద్ధి జరుగుతుందని విశ్వసించిన ఎంజీఆర్ ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటుకు సీఎం చంద్రబాబును, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబును, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ప్రత్యేకంగా కలిసి ఇక్కడి సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు.

## ప్రజల వద్దకే పాలన..

ప్రజాసేవ కోసమే తన జీవితాన్ని అంకితం చేసుకున్న ఎంజీఆర్.. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ప్రజల వద్దకే పాలన కార్యక్రమం చేపడుతున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రతి బుధవారం ఒక మండలం చొప్పున ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. అలాగే మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ఎమ్మెల్యేగా తనకు వచ్చిన ఐదు సంవత్సరాల జీత భత్యాలను ప్రజలకే వినియోగించేందుకు నిర్ణయించుకున్నారు. నిరుపేద విద్యార్థులకు ఇంటర్ నుంచి ఇంజనీరింగ్ వరకు తన సొంత నిధులతో చదివిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్యం కొరకు ఆర్థిక సహాయం చేస్తూ ప్రజలచే ఎంజీఆర్ జేజేలు అందుకుంటున్నారు.

## ఆధ్యాత్మిక వేత్తగా..

ఉత్తరాంధ్రకి తలమానికమైన శ్రీలమణి దుర్గ అమ్మవారి పెద్ద పండుగలు, వార్షికోత్సవాలు ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో మాట్లాడి కోటి రూపాయలను మంజూరు చేయించారు. నియోజకవర్గంలో అనేక దేవాలయాల నిర్మాణానికి, పునర్నిర్మాణనికి కోట్లాది రూపాయలు విరాళం అందించిన ఎంజీఆర్ కొత్తూరు మండలం నేరడి వేంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి టీటీడీ, ఇస్కాన్ వంటి



## అభివృద్ధే ధ్యేయంగా..

పాతపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందేలా చూస్తున్నారు. ఒకవైపు ఎమ్మెల్యేగా, మరోపక్క సేవామూర్తిగా సేవలు అందిస్తూ ప్రజల్లోనే ఉంటున్నారు. నైపుణ్యంగల విద్య అందుబాటులో ఉంటేనే ఈ ప్రాంత అభివృద్ధి జరుగుతుందని నమ్మి మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్షలాది రూపాయలు వెచ్చించి రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ఫ్యాకల్టీతో సుమారు వెయ్యి మంది విద్యార్థులకు టెట్, డీఎస్సీలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందిస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో జవహర్ నవోదయ విద్యాలయం నెలకొల్పాలన్న ఆశయంతో ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రంలో ఐటిఐ, కళాశాల, కొత్తూరు మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు గాను మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. ప్రభుత్వ ఆశ్రమ, వసతి గృహాలలో మౌలిక సదుపాయాల కోసం పాతపట్నం, హిరమండలం మండలాలలో సుమారు ఐదు కోట్లలో పీఎం జన్మాన్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉంచాలనే సదుద్దేశంతో 50 పడకల గల పాతపట్నం సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు గాను వైద్యఆరోగ్యశాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే కొత్తూరు మండల కేంద్రంలో మంజూరైన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని గత ఎమ్మెల్యే పాలకొండకు తరలించారు. దీంతో ఆ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తిరిగి కొత్తూరులోనే మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. అన్నం పెట్టే రైతన్నలు వ్యవసాయం చేసేందుకు అవసరమైన సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకాలను అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వంశధార, మహేంద్రతనయ ప్రాజెక్టుల నిర్మాణం, మెయింటినెన్స్‌కు అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విన్నవించారు.






## టీడీపీ సభ్యత్వ నమోదులో నంబర్‌వన్

టీడీపీ సభ్యత్వ నమోదులో పాతపట్నం నియోజకవర్గం రాష్ట్రంలో ముందంజలో ఉంది. సుమారు 60వేలు సభ్యత్వ నమోదు చేయించి జోన్1లో పాతపట్నంకు సముచిత స్థానం కల్పించారు. విజయవాడ వరద బాధితులకు తన వంతుగా పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. అధిష్టానం వరద అంచనాల కమిటీలో ఎంజీఆర్‌కు ముఖ్యమంత్రి చోటు కల్పించారు. దీంతో ఐదు రోజులు పాటు ఎంజీఆర్ విజయవాడలోనే పర్యటించి బాధితులను పరామర్శించి సాయం అందించారు. అమరావతి నిర్మాణానికి గాను అవసరమైన సహకారం అందిస్తున్నారు. అనేక సేవా కార్యక్రమాలలో ముందుండి తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్నారు. జీవితంలో అనేక కష్టాలను చవిచూసిన ఎంజీఆర్ తనని నమ్మిన ప్రజలు కోసం, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తూ నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలో నిలపాలన్నేదే జీవిత ఆశయంగా పెట్టుకుని తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారు ఎంజీఆర్.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546